సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 14 । మార్చి । 2025



తలరాతను మార్చే చేతిరాత

చక్కని దస్తూరితో పరీక్షల్లో అధిక మార్కులు సాధించవచ్చని, విద్యార్థులు ఈ దిశగా శ్రద్ధ పెట్టి విజయం సాధించాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. 8లో



రేపటి నుంచి టెన్నిస్ టోర్నీ

భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నుంచి ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్రవారం (సాయంత్రం)	సహరి శనివారం (ఉదయం)
భీమవరం	6.19	4.52
నరసాపురం	6.19	4.50
తాడేపల్లిగూడెం	6.14	5.00

న్యూస్‌రీల్

కోడ్ ముగిసినా తొలగని ముసుగులు



విస్సాకోడేరులో వైఎస్సార్ విగ్రహం

భీమవరం : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసిన అధికారులు ఎన్నికల కోడ్ ముగిసినా ముసుగులు మాత్రం తొలగించడం లేదు. గత నెలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించగా ఈనెల 4న ఫలితాలు వెల్లడయ్యాయి. కోడ్ ముగిసి రోజులు గడుస్తున్నా జిల్లాలోని పలు ప్రాంతాల్లో నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగుల తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకోలేదు. కొన్నిచోట్ల ఫ్లెక్సీలకు వేసిన ముసుగులను ఆయా పార్టీల కార్యకర్తలే తొలగించుకున్నారు.

95.4 శాతం హాజరు

భీమవరం : జిల్లావ్యాప్తంగా 52 కేంద్రాల్లో గురువారం నిర్వహించిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 95.4 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని డీఐఈఓ ఎ.నాగేశ్వరరావు తెలిపారు. జనరల్ కేటగిరీలో 18,488 మందికి 642 మంది, ఒకేషనల్ కేటగిరీలో 1,754 మందికి 1,483 మంది హాజరయ్యారని చెప్పారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

కవయిత్రి మొల్ల జయంతి



కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న అధికారులు

భీమవరం (ప్రకాశంచౌక్) : స్థానిక కలెక్టరేట్‌లో గురువారం కవయిత్రి మొల్ల జయంతిని నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు కవయిత్రి మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జి.గణపతి రావు, అధికారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగిరపర్చాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో మే నెలాఖరులోపు 6,319 గృహ నిర్మాణాలను పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి గృహ నిర్మాణ శాఖ అధికారులతో గూగుల్ మీట్ ద్వారా ఆమె సమీక్షించారు. జిల్లాలో 9,107 నిర్మాణాలకు గాను ఇప్పటికీ 2,788 ఇళ్లను పూర్తి చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయాన్ని విడుదలకు ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసిందన్నారు. జిల్లాలో ఎస్సీ లబ్ధిదారులు 5,593, ఎస్టీ లబ్ధిదారులు 385, బీసీ లబ్ధిదారులు 11,362 మొత్తంగా 18,340 మంది రూ.92.66 కోట్ల మేర లబ్ధి పొందనున్నారన్నారు. జిల్లా హౌసింగ్ అధికారి జి.పిచ్చయ్య, ఈఈ లు, డీఈలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నుంచి పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి సస్పెన్షన్



ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన పిల్లంగోళ్ల శ్రీలక్ష్మిని వైఎస్సార్‌సీపీ నుంచి సస్పెండ్ చేసినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. ఆమె పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్టు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణ కమిటీ సిఫార్సుల మేరకు పార్టీ అధ్యక్షుడు ఈ నిర్ణయం తీసుకున్నారు.

17 నుంచి ఒంటి పూట బడులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా ఈనెల 17 నుంచి ఒంటి పూట బడులు నిర్వహించనున్నట్టు డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలు ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ పనిచేస్తాయని, పదో తరగతి పరీక్షా కేంద్రాలు ఉన్న చోట మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకూ తరగతులు నిర్వహిస్తారన్నారు.

15న ముఖ్యమంత్రి పర్యటన

భీమవరం (ప్రకాశంచౌక్): తణుకులో ఈనెల 15న ఏర్పాటుచేసిన స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారాన్ని 'స్వచ్ఛ ఆంధ్ర' దినోత్సవంగా ప్రకటించి ప్రతి నెలా ఒక్కో జిల్లాలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటున్నారన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో పర్యటిస్తారన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం-పునర్వినియోగ వస్తువులను ప్రోత్సహించండి అనే థీమ్‌తో తణుకులో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని కలెక్టర్ తెలిపారు.

ఫెర్రీ ఆదాయానికి కన్నం

పంటు.. లాభాలు లేవంటూ..

- నరసాపురం-సఖినేటిపల్లి ఫెర్రీలో కూటమి నేతల హవా
- గతేడాది ఆదాయానికి గండికొట్టిన వైనం
- 2025-26కి ఈనెల 21న వేలం
- మరలా తక్కువ ధరకు ఫెర్రీ దక్కించుకునే ప్రయత్నం
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గణనీయంగా ఫెర్రీ ఆదాయం



నరసాపురంలో ఫెర్రీ రేవు

సాక్షి, భీమవరం: నరసాపురం-సఖినేటిపల్లి ఫెర్రీ నిర్వహణను కారుచౌకగా కొట్టేసే పనిలో కూటమి నేతలు ఉన్నారు. 2025-26కి సంబంధించి ఫెర్రీ నిర్వహణకు ఈనెల 26న వేలం నిర్వహించనుండగా 2024-25 మాదిరి కాంట్రాక్టర్లను సిండికేట్ చేసే ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. పశ్చిమ గోదావరి, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలను నరసాపురం రూరల్ మాధవాయిపాలెం-సఖినేటిపల్లి ఫెర్రీ రేవు చేరువ చేస్తుంది. వశిష్ట గోదావరికి అటు ఇటు ఉన్న రెండు రేవుల మధ్య పంటుల ద్వారా రోజూ అధిక సంఖ్యలో ప్రజలు, వాహనాలు రాకపోకలు సాగిస్తుంటారు. ఏప్రిల్ నుంచి మార్చి నెలాఖరు వరకు రేవు నిర్వహణకు ఏటా అధికారులు బహిరంగ వేలం నిర్వహిస్తారు. వచ్చిన ఆదాయాన్ని నరసాపురం, సఖినేటిపల్లి మండల పరిషత్‌లకు చెందేలా రెండు జిల్లాలకు చెందిన అధికారులతో ఏర్పాటుచేసిన జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) పర్యవేక్షిస్తుంది.

నష్టాల పేరుతో స్కెచ్

గతేడాది మే నెలలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగా ఫెర్రీ బహిరంగ వేలం నిర్వహణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఫెర్రీలో రవాణా చార్జీలుగా ఒక మనిషికి రూ.20, వాహనంతో పాటు ఒకరికి రూ.35, సైకిల్‌తో పాటు ఒకరికి రూ. 20, కారుకు రూ.150, ఆటోకు రూ.100లు వసూలు చేస్తున్నారు. రోజుకు రూ.లక్షకు పైనే ఆదాయం వస్తుందని అంచనా. ఈ మేరకు గతేడాది వేలం ఆదాయం మరింత పెరుగుతుందని అంతా భావించారు. కాగా నష్టం పేరిట కూటమి నాయకులు పక్కా స్కెచ్‌తో ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారు. 2023-24లో వేలం ధర రూ.3,60,99,999కు రూపాయి జోడించి 2024-25కు సంబంధించి రూ.3.61 కోట్లు ప్రారంభ ధరగా నిర్ణయించి గతేడాది జూన్ 21న జేఏసీ వేలం నోటీసు ఇచ్చారు. తర్వాత జూలై 2, 11 తేదీల్లో నోటీసులు ఇచ్చారు. వేలానికి ఎవరూ రాలేదన్న సాకుతో ప్రారంభ ధరను రూ.2.97,83,217కు తగ్గించి ఆగస్టులో సీల్డ్ కవర్, బహిరంగ వేలం నిర్వహించారు. ప్రారంభ ధరకు అదనంగా రూ.16,791 మాత్రమే జోడించిన సొసైటీకి వేలం ఖరారు చేయించారు. 12 నెలల కాలానికి మొత్తం వేలం ధర రూ.2,98,00,008 కాగా అప్పటికే ఐదు నెలలు గడిచిపోవడంతో మిగిలిన ఏడు నెలలకు అయిన మొత్తాన్ని చెల్లించే అవకాశాన్ని పాటదారులకు కల్పించారు. ఈ వ్యవహారంలో రేవు నిర్వహణలో ఆరితేరిన కొందరు నేతలు చక్రం తిప్పినట్టు తెలుస్తోంది. వేలం సొసైటీ పేరున ఉన్నా నిర్వహణ అంతా వారి కనుసన్నల్లోనే జరుగుతుందంటున్నారు. గత ప్రభుత్వంలో ప్రారంభ ధరపై రూ.కోటికి పైగా హెచ్చు ధర రాగా ఇప్పుడు కేవలం రూ.వేలల్లో మాత్రమే వచ్చినా అధికారులు ఆమోదించడం అనుమానాలకు తావిస్తోంది. రేవులో నష్టం వస్తుంటే గత ప్రభుత్వంలో మూడుసార్లు వేలం ధర అంత భారీగా ఎందుకు పెరిగిందన్న ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి.

ఫెర్రీ వేలం

సంవత్సరం	ప్రారంభ ధర (రూ.లలో)	హెచ్చుపాట (రూ.లలో)	పెరిగిన మొత్తం (రూ.లలో)
2018-19	1,86,70,670	1,87,29,999	59,329
2019-20	1,90,00,000	1,90,09,999	9,999
2020-21	1,94,23,332	2,00,05,000	5,81,668
2021-22	కోవిడ్ కారణంగా అధికారుల పర్యవేక్షణలో నిర్వహణ		
2022-23	1,78,99,644	2,79,99,999	1,01,00,355
2023-24	2,17,10,650	3,60,99,999	1,43,89,349
2024-25	2,97,83,217	2,98,00,008	16,791

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో భారీగా ఆదాయం

2019 మే నెలలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగా 2019-20కి గాను అప్పటికే టీడీపీ నాయకుల పర్యవేక్షణలో ఫెర్రీ వేలం జరిగిపోయింది. ఆ ఏడాది వేలం ప్రారంభ ధరపై హెచ్చు ధర కేవలం రూ.9,999 మాత్రమే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తొలిసారిగా 2020-21కి వేలం నిర్వహించారు. అప్పటివరకు ప్రారంభ ధరపై కేవలం వేలల్లో మాత్రమే ఉన్న హెచ్చు ధర మొదటిసారిగా రూ.5.82 లక్షలకు పెరిగింది. కరోనా నేపథ్యంలో 2021-22లో అధికారుల పర్యవేక్షణలో రేవు నిర్వహణ సాగింది. తర్వాత 2022-23కి జరిపిన వేలంలో ప్రారంభ ధరపై రూ.1.01 కోట్లు హెచ్చు ధర రాగా, 2023-24లో రూ.1.44 కోట్లు హెచ్చు ధర రావడం గమనార్హం. 2024-25కి సంబంధించి మార్చిలోపు వేలం నిర్వహించాల్సి ఉండగా సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆలస్యమైంది.

తక్కువ ధరకు దక్కించుకునేలా..

2025-26కి సంబంధించి రేవు నిర్వహణకు ఈనెల 21న బహిరంగ, సీల్డ్ టెండర్ల పద్ధతిలో వేలం నిర్వహణకు అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. పాట ప్రారంభ ధర రూ.3.13 కోట్లుగా నిర్ణయించారు. ఈసారీ తక్కువ ధరకు వేలం దక్కించుకునే పనిలో కూటమి నేతలు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. కాగా నిబంధనల మేరకే ఫెర్రీ వేలం నిర్వహిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వంపై పోరు సాగించండి



తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన పెండ్ర వీరన్న

నరసాపురం రూరల్: కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు నిలదీస్తూ ప్రజలకు అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్టు ఆ పార్టీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పెండ్ర వీరన్న తెలిపారు. గురువారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో జగన్‌మోహన్‌రెడ్డిని తాను కలిసిన సందర్భంలో పై విధంగా సూచించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడవక ముందే ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయిందని, ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ వంటి నేతలు ఇచ్చిన హామీల అమలు కోసం గట్టిగా డిమాండ్ చేయాలని జగన్ ఆదేశించారన్నారు. ప్రజలకు మంచి చేసే విషయంలో రాజీ లేని పోరాటం సాగించాలని సూచించారని, ప్రభుత్వం పెట్టే కేసులకు భయపడవద్దని అభయమిచ్చారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేసిన మంచిని రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాలు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నాయన్నారు. త్వరలోనే మంచి రోజులు వస్తాయని, అధైర్య పడవద్దని, కార్యకర్తలు నాయకులు ఐక్యంగా ఉంటూ ప్రభుత్వంపై పోరు సాగించాలని పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్టు వీరన్న తెలిపారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



విద్యాశాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సుధీర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయ రామరాజుకు వినతిపత్రం సమర్పించినట్టు వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సుధీర్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ బదిలీల కోసం చేసే చట్టంలో సర్వీస్ పాయింట్లు ఏడాదికి ఒకటి ఇవ్వాలని, యూపీ స్కూళ్లు, హైస్కూల్ ప్లస్‌లను యథాతథంగా కొనసాగించాలని కోరామని పేర్కొన్నారు. అలాగే కిలోమీటరు పరిధిలోని ప్రాథమిక పాఠశాలల నుంచి మాత్రమే మోడల్ ప్రైమరీ స్కూల్‌లోకి మూడు, నాలుగు, ఐదు తరగతులను విలీనం చేయాలని, మిగులు ఉపాధ్యాయులకు పాయింట్లు కేటాయించి బదిలీలకు అనుమతించాలని కోరామని తెలిపారు. ఎనిమిదేళ్లు కాకుండానే రేషనలైజేషన్‌కు గురయ్యే ఉపాధ్యాయులకు పూర్వ పాఠశాల స్టేషన్ పాయింట్లు, సర్వీస్ పాయింట్, రేషనలైజేషన్ పాయింట్లు కేటాయించాలని కోరామని సుధీర్ తెలిపారు.

రహదారి భద్రత.. అంతా మిథ్య!

- పనిచేయని స్పీడ్ గన్స్, బ్రీత్ అనలైజర్స్
- రవాణా శాఖలో సిబ్బంది కొరత
- రవాణా చెక్‌పోస్టులూ లేవు
- టోల్‌ప్లాజాలకే పరిమితమవుతున్న ఎన్‌హెచ్ పెట్రోలింగ్ వాహనాలు
- ఎన్‌హెచ్-16పై పర్యవేక్షణ కరువు



జాతీయ రహదారిపై సత్యనారాయణపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం (ఫైల్)

దెందులూరు : జిల్లాలోని జాతీయ రహదారి (ఎన్‌హెచ్-16)పై ప్రయాణం ప్రమాదభరితంగా మారింది. వాహనాల అతివేగాన్ని గుర్తించే స్పీడ్ గన్స్, వాహనాల డ్రైవర్లకు బ్రీత్ అనలైజర్ పరీక్షలు చేసే పరికరాలు పనిచేయకపోవడం, పూర్తిస్థాయిలో పర్యవేక్షణ కరువవడం ప్రమాదాలకు కారణంగా కనిపిస్తున్నాయి. దీంతో దెందులూరు నియోజకవర్గంలోని జాతీయరహదారిపై ప్రమాదాలు అధికారులకు పెను సవాల్‌గా మారాయి.

బ్రీత్ అనలైజర్స్ పరీక్షలేవీ

జిల్లాలో జాతీయ రహదారిపై మద్యం తాగి వాహనాలు నడిపే వారికి బ్రీత్ అనలైజర్ పరీక్షలు జరగడం లేదు. రవాణాశాఖ అధికారుల వద్ద ఉన్న బ్రీత్ అనలైజర్స్ పనిచేయకపోవడమే ఇందుకు కారణం. పెద్ద ఖరీదు లేకపోయినా కనీసం బ్రీత్ అనలైజర్స్‌ను కూడా కూటమి ప్రభుత్వం సమకూర్చడం లేదనే విమర్శలు ఉన్నాయి.

రంబల్ స్ట్రిప్స్ ఎక్కడ?

జాతీయరహదారిపై వాహనాల వేగానికి క్లాం వేసే రంబల్ స్ట్రిప్స్ ఎక్కడా కనిపించడం లేదు. బ్రిడ్జిలు, టర్నింగ్‌ల వద్ద వీటిని ఏర్పాటుచేస్తే కొంతమేర వాహనాల వేగం తగ్గుతుంది.

సిబ్బంది కొరత

రవాణా శాఖలో సిబ్బంది కొరత వేధిస్తోంది. జిల్లాలో ఒక డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్, ఆర్‌టీఓ, ఏడుగురు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, 15 మంది అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. అయితే వీరికి సహాయకారిగా ఉండే కానిస్టేబుళ్లు ఒక్కరూ లేరు. సాధారణంగా ఒక మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌కు ఒక కానిస్టేబుల్ ఉండాలి. దీంతో ఎంవీఐ, ఏఎంవీఐలే రహదారి పర్యవేక్షణ పనులు చూస్తున్నారు.

రవాణా చెక్‌పోస్టులు లేవు

జిల్లాలో జాతీయ రహదారిపై రవాణా చెక్ పోస్టులు కూడా లేవు. గతంలో జిల్లాలో 16 వరకు చెక్‌పోస్టులు ఉండగా ప్రస్తుతం ఒక్కటి కూడా లేకపోవడం గమనార్హం. ఎన్‌హెచ్‌పై రవాణా చెక్‌పోస్టులు ఉంటే వాహనచోదకులు జాగ్రత్తగా వెళతారని, మితిమీరిన వేగం తగ్గుతుందని పలువురు అంటున్నారు.

టోల్‌గేట్ల వద్దే హైవే పెట్రోలింగ్ పోలీసులు

హైవే పెట్రోలింగ్ పోలీసులు టోల్‌ప్లాజాలకే పరిమితమవుతున్నారు. నిత్యం జాతీయ రహదారి వెంబడి తిరుగుతూ ఎక్కడైనా వాహనాలు నిలిచిపోయినా, ప్రమాదాలు జరిగినా వీరు సహాయక చర్యలు అందించాల్సి ఉంది. అయితే కొన్ని పెట్రోలింగ్ వాహనాలు టోల్‌గేట్ల వద్ద, మరికొన్ని చెట్ల కింద నిలిపి ఉంటున్నాయి. ఇలా భద్రతా లోపాలు, పర్యవేక్షణ లేమి, పరికరాల లోటుతో తరచూ ఎన్‌హెచ్‌పై ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గత ప్రభుత్వంలో పక్కాగా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జాతీయ రహదారిపై స్పీడ్ గన్స్ పనిచేయడంతో పాటు వాటి పర్యవేక్షణకు డీఎస్పీ స్థాయి అధికారి ఉండేవారు. అతివేగంగా వెళ్లే వాహనాలను గుర్తించి వాహన యజమానులకు జరిమానాలు పంపేవారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత స్పీడ్ గన్స్ పనిచేయడం లేదు. వీటి పర్యవేక్షణ కరువవడంతో జరిమానాల మాటే లేదు. దీంతో వాహనచోదకులు మితిమీరిన వేగంతో వెళుతూ ప్రమాదాల బారినపడుతున్నారు. ఈ ప్రాంతంలో నిబంధనల మేరకు 60 కిలోమీటర్ల వేగంతో వెళ్లాల్సి ఉండగా 120 కిలోమీటర్లకు మించి వేగంతో కొన్ని వాహనాలు ప్రయాణిస్తున్నాయి.

ప్రమాదాల నివారణకు సమష్టి కృషి



జిల్లాలో ప్రమాదాల నివారణకు కృషిచేస్తున్నాం. ఆరు నెలల్లో పలు రకాల వాహనాలపై 15,105 కేసులు నమోదు చేసి రూ.9.26 కోట్లు అపరాధ రుసుంగా వసూలు చేశాం. రవాణా శాఖలో సిబ్బంది కొరత ఉంది. తమ అధికారుల ఆధ్వర్యంలో ప్రమాదాల నివారణకు జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో 174 అవగాహన సదస్సులు, సమావేశాలు నిర్వహించారు. ప్రమాదాల నివారణకు వాహనదారులు నిబంధనలు తప్పక పాటించాలి. జాతీయ రహదారులపై వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నాం.

– కరీం, జిల్లా రవాణా శాఖ కమిషనర్, ఏలూరు

పైసలిస్తేనే పనులు!

- తహసీల్దార్ కార్యాలయాల్లో ముడుపులు
- వరుసగా బయటపడుతున్న అక్రమాలు
- చాట్రాయి తహసీల్దార్ సస్పెన్షన్‌తో ఉలికిపాటు



ఏలూరు(మెట్రో) : ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అవినీతిమయం వెరసి ప్రజలకు ప్రభుత్వ సేవలు దూరమవుతున్నాయి. గ్రామస్థాయిలో సేవలందించాల్సిన అధికారులు అక్రమాలకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. గతంలో గ్రామ సచివాలయాల ద్వారా ఉన్న సమస్యల పరిష్కార వెసులుబాటు ప్రస్తుతం లేకపోవడం కొందరు అధికారులకు కల్పతరువుగా మారింది. జిల్లావ్యాప్తంగా 28 మండలాల పరిధిలో ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో భూ సమస్యలు అధికంగా ఉన్నాయి. ఎక్కువగా మ్యూటేషన్లు పెండింగ్‌లో పెడుతూ ప్రజల నుంచి రెవెన్యూ అధికారులు సొమ్ములు వసూలు చేస్తున్నారు. భూ సంబంధిత తగాదాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీకి ఇబ్బంది పెడుతున్నారు. దీంతో తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగాల్సి వస్తోంది. అవినీతి, సేవల జాప్యంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా అవినీతి ఆరోపణలతో చాట్రాయి తహసీల్దార్ డి.ప్రశాంతి సస్పెన్షన్‌కు గురికావడం రెవెన్యూ వర్గాల్లో ఉలికిపాటు కలిగించింది.

ఇప్పటికే జీలుగుమిల్లిలో..

ఏజెన్సీ ప్రాంతమైన జీలుగుమిల్లి మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వ్యవహరించిన సందీప్‌గౌడ్ సైతం రెవెన్యూలో అక్రమాలకు తెరలేపారు. ఆయనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదుల పరంపర కొనసాగడం, ఏజెన్సీ భూముల మ్యూటేషన్, రెవెన్యూ సమస్యల విషయాల్లో నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడమే సందీప్ సస్పెన్షన్‌కు సైతం దారి తీసింది.

గత ప్రభుత్వంలో పారదర్శకంగా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామ సచివాలయాల ద్వారా భూసమస్యల నుంచి జనన, మరణ, కులధ్రువీకరణ పత్రాల జారీ, భూముల రిజిస్ట్రేషన్ల వరకూ అవినీతికి తావులేకుండా సేవలందించేవారు. కూటమి ప్రభుత్వంలో సచివాలయాల ద్వారా ఆయా సేవలు అందకపోవడంతో ప్రజలు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాల బాట పట్టాల్సి వస్తోంది. అక్కడ ప్రతి పనికీ పైసలివ్వాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. రెవెన్యూ అధికారులు సొమ్ములు డిమాండ్ చేస్తున్నారంటూ ఉన్నతాధికారుల నుంచి ముఖ్యమంత్రి వరకు ఫిర్యాదులు చేస్తున్నారు.

చాట్రాయి తహసీల్దార్ సస్పెన్షన్

అవినీతి ఆరోపణలపై కలెక్టర్ చర్యలు

చాట్రాయి: అవినీతి ఆరోపణల నేపథ్యంలో చాట్రాయి తహసీల్దార్ డి.ప్రశాంతిని కలెక్టర్ వెట్రిసెల్వి గురువారం సస్పెండ్ చేశారు. చాట్రాయి మండలంలోని సోమవరంలో రిజిస్ట్రేషన్ అటవీ భూములను మ్యూటేషన్ చేయడం, జనార్దనవరంలో వాగు పోరంబోకు, అసైన్డ్ భూమికి పట్టా ఇవ్వడంపై ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై కలెక్టర్ రెండుసార్లు షోకాజ్ నోటీసులు ఇచ్చినా తహసీల్దార్ స్పందించలేదు. అలాగే తహసీల్దార్ అవినీతిపై సీఎం చంద్రబాబు వద్దకూ ఫిర్యాదులు వెళ్లాయి. సొమ్ములు తీసుకోకుండా తహసీల్దార్ ఏపని చేయడం లేదని మండల ప్రజలు అంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనులకు గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు కోరగా ఇవ్వనని, మంత్రి పార్థసారథిని వెళ్లి కలవాలనడం, గ్రావెల్ కోసం నరసింహరావుపాలెం పంచాయతీ తీర్మానం చేసినా అనుమతులు ఇవ్వకపోవడం వివాదాస్పదమయ్యాయి. అధికార తెలుగుదేశం పార్టీ నాయకులకు కొమ్ముకాస్తూ వారికి అనుమతులు ఇవ్వడం, వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆమె కార్యాలయానికి వెళితే పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. తెలుగుదేశం పార్టీకి చెందిన ఇద్దరు వ్యక్తులు తహసీల్దార్‌కు షాడోలుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు అంటున్నారు.

కేసుల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): ప్యానల్ న్యాయవాదులు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం ఏలూరు, భీమడోలు కోర్టుల పరిధిలో ప్యానల్ న్యాయవాదులతో ఆయన సమావేశం ఏర్పాటుచేశారు. న్యాయ సేవాధికార సంస్థ అందించే ఉచిత సేవలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని, న్యాయవిజ్ఞాన సదస్సుల్లో పాల్గొని ప్రజలకు చట్టాలపై అవగాహన కలిగించాలని, సంక్షేమ పథకాలను పొందటానికి అర్హులైన వారికి అవసరమైతే న్యాయ సహాయాన్ని అందించాలని సూచించారు. ఆయా కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

క్లుప్తంగా

గోవుల అక్రమ రవాణా అడ్డగింత


బందెల దొడ్డిలో ఉన్న గోవులు

కుక్కునూరు: ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తున్న గోవులను స్థానికులు పట్టుకుని వెటర్నరీ సిబ్బందికి అప్పగించారు. వివరాల ప్రకారం ఛత్తీస్‌ఘడ్, ఒరిస్సా ప్రాంతాల నుంచి కొనుగోలు చేసిన గోవులను కొందరు గురవారం ఉదయం వింజరం రేవు వద్ద గోదావరి దాటించి తీసుకెళ్లడాన్ని గమనించిన స్థానికులు విలేకరులకు, వెటర్నరీ ఏడీకి సమాచారం అందించారు. వెంటనే ఆ శాఖ సిబ్బంది వచ్చి తనిఖీ చేసి ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో గోవులను బందెలదొడ్డికి తరలించి, పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయమై బీజేపీ, విశ్వహిందూ పరిషత్ సభ్యులు మాట్లాడుతూ గోవుల అక్రమ రవాణాకు కుక్కునూరు మండలం రాజమార్గంలా తయారైందని విమర్శించారు. అధికారులు గోవులను తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జంగారెడ్డిగూడెంలో రోడ్డు ప్రమాదం


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో గురువారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. ద్వారకాతిరుమల నుంచి గోపాలపురం వెళుతున్న కారు పట్టణంలోని బుట్టాయగూడెం రోడ్డులో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ప్రమాద సమయంలో కారులో ఉన్న వ్యక్తి సీటు బెల్టు ధరించి ఉండడంతో కారులో బెలూన్‌లు తెరుచుకోవడంతో కారులోని వ్యక్తి సురక్షితంగా బయటపడ్డాడు. అలాగే ప్రమాదం తెల్లవారుజామున జరగడంతో సదరు ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో విద్యుత్ స్తంభం విరిగి కింది పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

స్వర్ణలతకు సూపర్ ఉమెన్ అవార్డు



హైదరాబాద్‌లో అవార్డు అందుకుంటున్న డాక్టర్ డీఆర్ స్వర్ణలత

పాలకోడేరు: సెయింట్ జాన్స్ వెల్ఫేర్ సొసైటీ అధినేత డాక్టర్ డీఆర్ స్వర్ణలతకు 'ఝాన్సీ లక్ష్మీబాయి సూపర్ ఉమెన్–2025' అవార్డు వరించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్లో కొమ్మూరి చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ కె.శ్రీనివాస్, సరస్వతి ఉపాసకులు శ్రీ దైవజ్ఞ శర్మ చేతుల మీదుగా ఈ అవార్డు ను అందుకున్నట్లు ఆమె స్థానిక విలేకరులకు ఫోన్‌లో తెలిపారు. గత 25 సంవత్సరాలుగా సమాజానికి తాను చేస్తున్న సేవను గుర్తించి ఈ అవార్డు ఇచ్చారని ఆమె వివరించారు.

తలరాతను మార్చే చేతిరాత

- అందమైన దస్తూరితో అధిక మార్కులు
- విద్యార్థులకు ప్రత్యేక సూచనలిస్తున్న ఉపాధ్యాయులు


భీమడోలు హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులకు చేతిరాతపై సూచనలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు (ఫైల్)



అందమైన దస్తూరి

భీమడోలు: చేతిరాత తలరాతను మార్చుతుంది అనే నానుడి అక్షర సత్యం అవుతుందని నిపుణులు చెబుతున్నారు. గతంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు ఉత్తరాలపై ఆధారపడేవారు. కానీ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రస్తుత రోజుల్లో యువత ఎక్కువగా స్మార్ట్ ఫోన్ వినియోగిస్తున్నారు. దీంతో చేతిరాతపై ఆసక్తి సన్నగిల్లుతుంది. అయితే జీవితానికి కీలకమైన పదో తరగతి పరీక్షలు ఈ నెల 17 నుంచి జరగున్నాయి. ఈ నేపథ్యంలో ఈ పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి చేతిరాత కీలకంగా మారనుంది. ముత్యాల్లాంటి దస్తూరితో ఉపాధ్యాయులను మెప్పిస్తే మంచి మార్కులు సొంతమవుతాయని చేతిరాత నిపుణులు చెబుతున్నారు. ఏడాది పాటు కష్టపడి చదివినా పరీక్షల్లో అందమైన చేతిరాతతో సమాధానాలు రాస్తేనే మంచి ఫలితాలు వస్తాయి. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో చేతిరాత నిపుణులు విద్యార్థులకు పలు సూచనలు చేస్తున్నారు.

నిపుణుల సూచనలివే

- విద్యార్థులు రివిజన్ సమయంలో చేతిరాతపై దృష్టి పెట్టాలి.
- పరీక్ష రాసే సమయంలో కాగితంపై మరీ ఒత్తిపెట్టి రాయకూడదు. ఇలా చేస్తే ఇది వేగంపై ప్రభావం చూపుతుంది.
- సున్నా, నిలువు గీతాలపై సాధన చేయాలి. ఇంగ్లిష్, తెలుగు భాషల్లో అపసవ్య దిశలో, హిందీలో సవ్య దిశలో రాయడం మంచిది.
- బుక్‌లెట్‌లో కుడి, ఎడమల్లో కొంత మార్జిన్ వదిలి రాయాలి. పేజీకి ఇరవై లైన్లు మించి రాయకూడదు.
- పదాలు రాసేటప్పుడు మొదటి అక్షరం పెద్దగా ఉండాలి. ఇంగ్లీషు పదాలు మూడు మిల్లీ మీటర్లు, హిందీ, తెలుగు అక్షరాలు నాలుగు మిల్లీ మీటర్లు పొడవు ఉండేలా రాస్తే అక్షరాలు ముత్యాల్లా ఉంటాయి.
- పదానికి పదానికి మధ్య దూరం ఒక అక్షరం ఉండాలి. రాసే కొద్దీ అక్షరాల ఆకారం మారిపోకూడదు. అందంగా రాస్తూనే వేగం పెంచి రాయాలి.
- రాసే తరుణంలో కూర్చునే భంగిమ, పెన్ను పెట్టుకునే విధానం, రాసే విధానం ఒకేలా ఉండాలి.
- తెలుగులో అక్షరాలు గుండ్రంగా ఉండాలి. ఇంగ్లీషులో చక్కని స్ట్రోక్స్‌తో కొద్దిగా వాలు కలిగి అందమైన ఆకారం రాయాలి.
- కుడి చేత్తో రాసే వారు పేపర్, బుక్‌లెట్‌ను కాస్త ఎడమ వైపునకు, ఎడమ చేత్తో రాసేవారు కుడి వైపునకు వంచి రాయాలి.
- ముఖ్యంగా వ్యాకరణ దోషాలు లేకుండా చూసుకోవాలి. ఆంగ్లంలో స్పెలింగ్‌లు తప్పులు లేకుండా ఉండాలి. పరీక్షా ముగింపు సమయానికి 5, 10 నిమిషాల ముందు పూర్తి అయ్యేలా ప్రణాళిక చేసుకోవాలి.
- అర్థవంతమైన పదాలను విడగొట్టకుండా చూసుకోవాలి. కొట్టి వేతలు లేకుండా జాగ్రత్త పడాలి.

తప్పులు లేకుండా చూసుకోవాలి



పరీక్ష రాసే విద్యార్థులు భయం, ఒత్తిడి లేకుండా పొందుగ్గా అక్షరాలు రాయడంపై దృష్టి సారించాలి. క్వశ్చన్ పేపర్‌లో బాగా వచ్చిన ప్రశ్నకు సమాధానం రాయాలి. రాసే తరుణంలో తప్పులు లేకుండా చూసుకోవాలి. ఇచ్చిన బుక్‌లెట్‌లో పేజీలన్నీ రాస్తే మంచిది. దస్తూరితోనే అదనంగా మార్కులు పొందుతారు. చిన్న అక్షరాలు కంటే పెద్ద అక్షరాలు రాయండి.
– పొత్తూరి కృష్ణంరాజు(వాసు) చేతిరాత నిపుణుడు, నారాయణపురం

సమయాన్ని వృథా చేసుకోవద్దు



పరీక్షా పేపర్‌ను చదివిన తర్వాత బాగా వచ్చిన ప్రశ్నకు సమాధానం రాయాలి. తొందర పడొద్దు. కష్టమైన ప్రశ్న రాయడానికి సిద్ధపడి సమయాన్ని వృథా చేసుకోవద్దు. మనోధైర్యాన్ని కోల్పోతే భయం, ఒత్తిడి పెరుగుతంది. ఇంగ్లీషు గ్రామర్ పాయింట్లు, లెక్కల్లో ఫార్ములాలు, సోషల్‌లో మ్యాప్‌లు, సైన్సులో డయాగ్రామ్‌లు వేయాలి. దస్తూరి బాగుండి.. చక్కగా ప్రజెంటేషన్‌తో అదనపు మార్కులు సాధిస్తారు.
– ఈదుపల్లి శ్రీనివాసరావు, ఎంఈఓ, భీమడోలు

రేపటి నుంచి ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్


భీమవరంలో టెన్నిస్ టోర్నమెంట్ వివరాలు వెల్లడిస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక కాస్మోపాలిటన్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నుంచి ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంటు నిర్వహిస్తున్నట్లు క్లబ్ ఉపాధ్యక్షుడు ఎం.సుబ్బరాజు, టోర్నమెంట్ డైరెక్టర్ యూఆర్‌పీఆర్ వర్మ చెప్పారు. క్లబ్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. 15, 16 తేదీల్లో క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. 17 నుంచి 21 వరకు ప్రధాన పోటీలు నిర్వహిస్తామన్నారు. కాస్మోపాలిటన్ క్లబ్, యూత్ కల్చరల్ అసోసియేషన్, ఎల్‌హెచ్ భీమవరం టౌన్‌హాల్, డీఎన్నార్ కళాశాల, ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణల్లోని టెన్నిస్ కోర్టుల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి 220 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటున్నారని . విజేతలకు రూ. 4 లక్షలు విలువైన బహుమతులు అందిస్తామన్నారు. 35, 45, 55, 65, 70,75 ఏళ్ల విభాగాల్లో సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో నిర్వహించే పోటీలకు వెర్‌టెక్స్ హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండీ వి.వెంకట రాయవర్మ ప్రధాన సహకారం అందిస్తున్నారని తెలిపారు. సమావేశంలో ఏపీఎస్ టీపీఏ కార్యదర్శి ఎ.రాంబాబు, కేఆర్‌కే రాజు, క్లబ్ సెక్రటరీలు పీవీ రామరాజు, వీవీఎస్‌ఎస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

జన్యు ఎడిటింగ్ ద్వారా కొత్త వంగడాల అభివృద్ధి

డాక్టర్ ఎంఎస్ రెడ్డి సూచన


పీజీపీఆర్ సొసైటీతో ఎంఓయూ చేసుకుంటున్న ఉద్యానవర్సిటీ వీసీ కె.గోపాల్

తాడేపల్లిగూడెం: జన్యు ఎడిటింగ్ పద్ధతి ద్వారా అధిక నిల్వ సామర్థ్యం, మెరుగైన నాణ్యతా ప్రమాణాలు కలిగిన పండ్లు, పువ్వులు, కూరగాయలకు సంబంధించి కొత్త వంగడాలను (జాతులను) అభివృద్ధి చేయవచ్చని పీజీపీఆర్ ఆసియా సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఎంఎస్ రెడ్డి చెప్పారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో గురువారం సంయుక్త ఆధ్వర్యంలో 'అన్యదేశ పంటలు–హైబ్రిడ్, హరిత భవిష్యత్ కోసం ప్రపంచ వాణిజ్యం , సుస్థిర సాంకేతికతలు' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. వర్సిటీ ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ఎంఎస్ రెడ్డి విదేశీ కూరగాయల సాగుతో ఇక్కడి రైతులు అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ మాట్లాడుతూ అవకాడో, డ్రాగన్ ఫ్రూట్, రాంభూటాన్, అబ్లు, ఫ్యాషన్ ఫ్రూట్, ఫిగ్, మాంగోస్టీన్, లిచ్చి, దురైన్, స్టార్ ఫ్రూట్ వంటి విదేశీ పండ్లు, ఆర్కిడ్స్, డైసీ, డాఫోడిల్ , లోటస్, తులిప్, లిసియాంతుస్, హైబిస్కస్, అమరిల్లస్, ఆడినియం, వంటి విదేశీ పుష్పాలు, బ్రకోలీ, చెర్రీటమాటో, పర్స్లీ, యూరోపియన్ క్యారోట్, క్యాప్సికం, రమనేస్కో కాలిఫోవర్, రాడిష్, ఓకా వంటి విదేశీ కూరగాయలు మన రాష్ట్రంలో సాగుచేస్తే రైతులు మంచి ఆదాయం పొందవచ్చన్నారు. ఇలా సాగు చేయడం ద్వారా దిగుమతులు తగ్గి విదేశీ మారకం నిలిచి ఉంటుందన్నారు. స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా వ్యవసాయానికి , ఉద్యానానికి అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారన్నారు. ఈ క్రమంలో అన్యదేశ పంటలను ప్రోత్సహించేందుకు పీజీపీఆర్ ఆసియా సొసైటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. ఈ సదస్సులో వర్చువల్‌గా వియత్నాం ప్రొఫెసర్ నోగ్యన్ థాయ్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ ఫామ్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ కె.సురేష్, జాతీయ ఉద్యానపరిశోధనా స్థానం కో–ఆర్డినేటర్ డాక్టర్ ప్రకాష్ పాటిల్ తమ అభిప్రాయాలను తెలిపారు. జీవవైవిధ్యం, ఆహార భద్రతను పెంపొందించడానికి అన్యదేశ పంటలు అనే విషయంపై ఐఐహెచ్‌ఆర్ సైంటిస్టు జి.కరుణాకరన్ మాట్లాడారు. పీజీపీఆర్‌తో ఒప్పందం వల్ల ఉద్యానవర్సిటీ శాస్త్రవేత్తలకు, పరిశోధన చేసే విద్యార్థులకు విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం చేయాలనుకునే విద్యార్థులకు సాంకేతిక సహకారం, ఆసియా సొసైటీ అందిస్తుందని వీసీ గోపాల్ తెలిపారు. ఈ ఒప్పందంతో కలిపి ఇప్పటి వరకు 82 ఒప్పందాలు చేసుకున్నామని సదస్సు కన్వీనర్, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రియల్, ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ కె.ధనుంజయరావు చెప్పారు. గురువారంతో ఈ సదస్సు ముగిసిందని పేర్కొన్నారు.

నత్తారామేశ్వరంలో భారీ చోరీ

పెనుమంట్ర: మండలంలోని నత్తారామేశ్వరంలో తాళం వేసి ఉన్న ఇంట్లో భారీ సోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాలీరోడ్‌లో నివాసం ఉంటున్న దివ్యాంగురాలైన కొవ్వూరి హేమ సంధ్యారాణి ఈ నెల 8న అయినపర్రులోని పుట్టింటికి తన చిన్న కుమార్తెతో కలిసి వెళ్లింది. ఆమె భర్త జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉండగా పెద్ద కుమార్తె ఉన్నత చదువుతు నిమిత్తం కడపలో ఉంటుంది. బుధవారం సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన ఆమె తాళాలు పగులగొట్టి ఉండడం గమనించి ఇంట్లోకి వెళ్లి చూసి చోరీ జరిగిందని గుర్తించింది. ఈ చోరీలో తన పూర్వీకులు ఇచ్చిన పాత ట్రంక్ పెట్టెలో దాచిపెట్టుకున్న 35 కాసుల బంగారు ఆభరణాలు, నాలుగున్నర కిలోల వెండి సామాన్లు దొంగలు దోచుకుపోయినట్లు గుర్తించింది. ఈ మేరకు ఆమె స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పిల్లల భవిష్యత్ కోసం తన భర్త కష్టపడి సంపాదించిన సొమ్ముతో కొనుగోలు చేసిన ఆభరణాలు దొంగలు దోచుకెళ్లిపోయారని ఆమె బోరున విలపిస్తుంది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఏలూరు (టూటౌన్): ఇంటికి తాళాలు వేసుకుని ఆసుపత్రిలో ఉన్న బంధువల వద్దకు వెళ్లి వచ్చేసరికి ఇంట్లోకి చొరబడిన గుర్తు తెలియని దుండగులు వెండి ఆభరణాలు, నగదును దోచుకెళ్లిన ఘటన ఏలూరు రూరల్ పరిధిలో చోటుచేసుకుంది. ఏలూరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొమరవెల్లి ప్రాంతంలో రాజులపాటి సంధ్య, రాధాకృష్ణ దంపతులు నివాసం ఉంటున్నారు. ఈ నెల 12న మధ్యాహ్నం 12 గంటలకు సంధ్య తన బంధువులకు ఆరోగ్యం సరిలేదని హాస్పటల్లో ఉండడంతో వారిని పలకరించేందుకు ఇంటికి తాళాలు వేసి వెళ్లింది. తిరిగి గురువారం ఉదయం 10 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. వెంటనే వెళ్లి చూడగా బీరువాలో ఉండాల్సిన 14 తులాల వెండి ఆభరణాలు 2000 రూపాయల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించింది. దీంతో ఆమె రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రూరల్ ఎస్సై దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి గుబ్బల మంగమ్మ జాతర


గుబ్బల మంగమ్మ జాతరకు గుడి వద్ద ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసిన దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన కామవరం అటవీప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ తల్లి జాతర మహోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజులపాటు జరిగే ఈ జాతర మహోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ కమిటీ పూర్తి చేసింది. అమ్మవారికి ముఖ్యమైన రోజుగా చెప్పుకునే శుక్రవారంతో పాటు మూడో రోజు ఆదివారం రావడంతో లక్షలాది మంది భక్తులు జాతర పాల్గొనే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ జాతర మహోత్సవాల్లో పూర్తిగా గిరిజన సాంప్రదాయ పద్ధతిలోనే నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. అలాగే ఈ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్సై దుర్గామహేశ్వరరావు చెప్పారు.

రెడ్డి గణపవరంలో దుర్గమ్మతల్లి ఉత్సవాలు

మండలంలోని రెడ్డిగణపవరంలో కొలువై ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఐదురోజులపాటు జరిగే ఈ ఉత్సవాలకు సంబంధించి ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. కనకదుర్గమ్మ జాతర నేపథ్యంలో బుట్టాయగూడెం నుంచి జీలుగుమిల్లి వెళ్లే భారీ వాహనాలు జంగారెడ్డిగూడెం మీదుగా, జీలుగుమిల్లి నుంచి బుట్టాయగూడెం వచ్చే వాహనాలను జంగారెడ్డిగూడెం మీదుగా దారి మళ్లించినట్లు ఎస్సై తెలిపారు.

దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు


నిందితుడు, చోరీ చేసిన వెండి ఆభరణాలను మీడియాకు చూపుతున్న డీఎస్పీ శ్రీవేద

నరసాపురం: పట్టణంలో ఓ తాళంవేసిన ఇంట్లో దొంగతనానికి పాల్పడిన కేసును పోలీసులు ఛేదించారు. కాకినాడ జిల్లా జగ్గంపేట గ్రామానికి చెందిన సిడగం కుమార్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి రూ.5 లక్షలు విలువ చేసే 5.250 కిలోల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం రాత్రి నరసాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నరసాపురం డీఎస్పీ డాక్టర్ బి.శ్రీవేద వివరాలు వెల్లడించారు. పట్టణంలోని స్టీమర్‌రోడ్డులో నివాసం ఉంటున్న యర్రాప్రగడ సుబ్బారావు ఈ ఏడాది జనవరి 31న ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి హైదరాబాద్ వెళ్లాడు. అయితే ఈ నెల 3న సుబ్బారావు కుమారుడు వరుసయ్యే కార్తీక్ ఇంటికి వెళ్లి చూసి తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించి ఫోన్ ద్వారా సుబ్బారావుకు తెలిపాడు. దీంతో బంధువులు ఇంట్లోకి వెళ్లి చూడగా ఇనుప బీరువాలోనూ, పూజ గదిలోనూ ఉంచిన వెండి వస్తువులు దొంగిలించుకుపోయారని గుర్తించి పోలీసుకు ఫిర్యాదు చేశారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుడిని అరెస్ట్ చేశామని డీఎస్పీ శ్రీవేద తెలిపారు. అతనిపై పలు జిల్లాల్లో 15కు పైగా దొంగతనం కేసులు ఉన్నాయని చెప్పారు. కుమార్‌తో పాటు కలిపి దొంగతనం చేసిన విజయవాడకు చెందిన ఉయ్యాల నరేష్, అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన రేలంగి కృష్ణబాబు పరారీలో ఉన్నారని చెప్పారు. నిందితుడి నుంచి వెండి వస్తువులతో పాటు హైదరాబాద్‌లో చోరీ చేసిన పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. సీఐ బి.యాదగిరి, ఎస్సైలు సీహెచ్ జయలక్ష్మి, ఎస్ఎన్ ముత్యాలరావు పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ


పెద్దింట్లమ్మ దర్శనానికి కలశాలతో వస్తున్న భక్తులు

కై కలూరు: మండలంలోని కొల్లేటి కోట శ్రీపెద్దింట్లమ్మ ఉత్సవాల్లో భక్తుల రద్దీ కొనసాగుతుంది. ఉత్సవాలు ముగింపు దశకు చేరుకోవడంతో అమ్మవారి ఆలయానికి గురువారం భక్తులు పోటెత్తారు. ఉత్సవాల సందర్భంగా అర్చకులు ఉదయం నుంచి అమ్మవారికి వివిధ వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు అయిభీమవరం గ్రామానికి చెందిన గొట్టుముక్కల వెంకటసత్యనారాయణరాజు, సుబ్బలక్ష్మి దంపతులు, పొత్తూరి సురేష్‌రాజు, శ్రీలత దంపతులు ఉచితంగా ప్రసాద వితరణ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కైకలూరుకు చెందిన శ్యామలా నాటక కళా అకాడమీ నిర్వాహకురాలు కురేళ్ళ లక్ష్మీజ్యోతి శిష్యబృందం కూచిపూడి భరతనాట్య ప్రదర్శన ఇచ్చింది. ఏర్పాట్లను ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాసు పర్యవేక్షించారు.

ఇరువర్గాల దాడిలో ఏడుగురికి గాయాలు

జంగారెడ్డిగూడెం: ఓ పొగాకు బ్యారన్ విషయంలో తలెత్తిన వివాదానికి సంబంధించి ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటనలో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. జీలుగుమిల్లి మండలం స్వర్ణవారిగూడానికి చెందిన ఒక వర్గానికి సంబంధించిన తొమ్మిదేళ్ల వెంకటరత్నం, తొమ్మిదేళ్ల వీరభద్రరావు, తొమ్మిదేళ్ల నరసింహారావు, తొమ్మిదేళ్ల సూర్యచంద్రరావులు, మరో వర్గానికి చెందిన ధనేకుల తరుణ్‌కుమార్, ధనేకుల చల్లారావు, డెక్కం నాగరాజు ఒకరిపై ఒకరు గురువారం రాత్రి కర్రలతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో ఏడుగురికి తలలపై తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వీరంతా చికిత్స కోసం స్థానిక ఏరియా ఆసుపత్రికి వచ్చారు. ఆసుపత్రిలో వీరికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆకాశవాణి జాతీయ కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు


కళాకారులను సన్మానిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం/జంగారెడ్డిగూడెం: విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో మహాత్మాజ్యోతిరావు పూలే జీవిత చరిత్రను కంజర కథగా ఆలపిస్తూ గురువారం రికార్డింగ్‌లో చేసినట్లు జంగారెడ్డిగూడేనికి చెందిన చిలుకూరి సుబ్బయ్యాచారి తెలిపారు. తనకు బుట్టాయగూడేనికి చెందిన ప్రముఖ డోలక్ కళాకారుడు పెనుగుర్తి సోంబాబు,, పాశ్లూరి ఏసురత్నం హార్మోనియం ద్వారా సహకారం అందించడంతో ఆల్ ఇండియా రేడియో బృందం రికార్డింగ్ చేశారని చెప్పారు. పూలే జీవితచరిత్ర ఆధారంగా సుబ్బయ్యాచారి చెప్పే కంజరకథ భారతదేశంలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల్లో ఒకే రోజు, ఒకే సమయానికి ప్రసారం జరగనుంది. ఈ కార్యక్రమం అనంతరం రేడియో స్టేషన్ డైరెక్టర్ చుండూరి శ్రీనివాస్, జయప్రకాష్‌లు తమ బృందాన్ని అభినందించి శాలువాలతో సత్కరించారని వివరించారు.

ఐఆర్‌టీసీ ఆధ్వర్యంలో సప్త జ్యోతిర్లింగ దర్శన యాత్ర

ఏలూరు (టూటౌన్): ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్‌సీటీసీ), సౌత్ సెంట్రల్‌జోన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 8న విజయవాడ నుంచి సప్త జ్యోతిర్లింగ దర్శన యాత్ర పేరుతో ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు ఐఆర్‌టీసీ విజయవాడ ఏరియా మేనేజర్ ఎం.రాజా గురువారం ఒక ప్రకటనలో తెలియజేసారు.ఏప్రిల్ 8 నుంచి 19వ తేదీ వరకు 11 రాత్రులు,12 పగలు ఈ యాత్ర సాగుతుందన్నారు. యాత్రలో భాగంగా ఉజ్జయినీ, ద్వారక, సోమనాథ్, పూణె, నాసిక్, ఔరంగాబాద్ పుణ్య క్షేత్రాలను సందర్శించే అవకాశం ఉందన్నారు. వచ్చే నెల 8న విజయవాడలో బయలుదేరే యాత్ర రైలు ఖమ్మం, కాజీపేట, సికింద్రాబాద్ మీదుగా వెళుతుందన్నారు. స్లీపర్ క్లాస్‌కు టిక్కెట్ ధర పెద్దలకు రూ.20,890, పిల్లలకు రూ.19,555 చొప్పున, థర్డ్ ఏసీ టిక్కెట్ ధర పెద్దలకు రూ.33,735, పిల్లలకు రూ.32,160, సెకండ్ ఏసీ టిక్కెట్ ధర పెద్దలకు రూ.44,375, పిల్లలకు రూ.42,485 చొప్పున నిర్ణయించామని పేర్కొన్నారు. హోటల్స్‌లో రాత్రి బస, రవాణా,ఉదయం టీ, అల్పాహారం, భోజనం, రాత్రి భోజనం, ప్రయాణ బీమా, ఎస్కార్ట్ సేవలు అందిస్తారని వివరించారు. టిక్కెట్ల బుకింగ్ కోసం ఐఆర్‌టీసీ రైల్వే రిటైరింగ్ రూమ్ వద్ద విజయవాడ రైల్వేస్టేషన్, లేదా 92814 95848, 92810 30714 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

పాముకాటుతో మహిళ మృతి

పెదవేగి: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఓ మహిళ పాము కాటుతో మృతి చెందింది. పెదవేగి ఎస్సై కె.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీపురం గ్రామానికి చెందిన సొంగ దేవమాత(45) ఈ నెల 12న బుధవారం మధ్యాహ్నం తోటలో గేదెలు కాస్తున్న సమయంలో పాము కాటుకు వేసింది. దీంతో స్పందించిన స్థానికులు హుటాహుటిన ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ మేరకు ఏలూరు ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసిన వ్యక్తిపై కేసు

ఏలూరు (టూటౌన్): ఏలూరు రూరల్ పరిధిలోని బీడీ కాలనీ చెరువుగట్టు పై ఎర్ర పూర్ణ కుమార్ అనే వ్యక్తి తన ఇంటిలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ముందస్తు సమాచారం అందుకున్న తంగెళ్లమూడి–2 సచివాలయ వీఆర్‌ఓ అతని ఇంటిపై దాడి చేసి 310 కేజీల రేషన్ బియ్యాన్ని గుర్తించి వాటిని సీజ్ చేశారు. ఈ మేరకు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీజ్ చేసిన బియ్యం విలువ రూ.12,400 ఉంటుంది.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని మహిళ మృతి


మహిళ మృతదేహం

మండవల్లి: మోటూరు రైల్వే స్టేషన్ నుంచి మండవల్లి రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో కిలోమీటరు నెంబరు 51–7–9 మధ్యలో ఓ గుర్తు తెలియన మహిళ మృతదేహాన్ని గురువారం ఆన్ డ్యూటీ కీమెన్ గుర్తించాడు. రైలు నుంచి జారిపడి తలకు తీవ్ర గాయం కావడంతో ఆమె మరణించినట్లు భావిస్తున్నారు. మృతురాలి వివరాలు తెలిస్తే 94407 96570కు ఫోన్ చేయాలని గుడివాడ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్సై తెలిపారు.

ఎక్కడి చెత్త అక్కడే!

- చెత్తకూపంలో స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలా..?
- పారిశుద్ధ్య నిర్వహణలో కునారిల్లుతున్న తణుకు మునిసిపాలిటీ
- సీఎం పర్యటనతో చిరు వ్యాపారుల్లో గుబులు
- పచ్చని చెట్ల కొమ్మలు నరికివేత
- మండిపడుతున్న స్థానికులు

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 15వ తేదీన తణుకు పర్యటనతో తణుకు పట్టణంలో వివిధ శాఖల అధికారుల హడావుడి, వెళ్లే కార్లు, వచ్చేకార్లతో రద్దీగా మారింది. పర్యటనలో భాగంగా తణుకు పాలిటెక్నిక్ కళాశాలలో హెలిపాడ్ ఏర్పాటు పనులు ముమ్మరంగా చేస్తున్నారు. పాలిటెక్నిక్ కళాశాలలో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ప్రజలతో బహిరంగ సమావేశం, కూరగాయల హోల్‌సేల్ మార్కెట్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొనన్నుట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిన సామెత మాదిరిగా సీఎం పర్యటనపై అధికారులు, ప్రజానీకం, చిరు వ్యాపారులు తలలు పట్టుకుంటున్నారు.

తణుకు ఎంపిక పట్ల తలోమాట..

పారిశ్రామికంగా దేశ వ్యాప్తంగా గుర్తింపు పొంది, పచ్చదనానికి మారుపేరుగా ఉండే తణుకు నేడు చెత్త కుప్పలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని, మురికి కూపంగా డ్రెయినేజీలు కనిపిస్తున్నాయని తణుకు వాసులు గగ్గోలుపెడుతున్నారు. గతంలో ఇంటి చెత్త నేరుగా కంపోస్టు యార్డుకు వెళ్లే పరిస్థితి ఉండగా నేడు కూటమి ప్రభుత్వం వచ్చిన రోజు నుంచి ఇంటి చెత్త రోడ్డుపై గంటల తరబడి వేచిఉండాల్సి వస్తోంది. అంతేకాకుండా కొన్ని ప్రాంతాల్లో ఏకంగా మునిసిపల్ అధికారులే చెత్త పాయింట్లుగా ఏర్పాటు చేసి స్థానికంగా సేకరించిన చెత్తను గుట్టగా వేసి దుర్గంధాన్ని వెదజల్లుతున్న దుస్థితిలో పారిశుద్ధ్య నిర్వహణ ఉందని తణుకువాసులు వాపోతున్నారు. చెత్త కుప్పల మధ్య స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర ఎలా నిర్వహిస్తారని సామాన్యుడికి తలెత్తుతున్న ప్రశ్నగా మిగిలింది. ప్రస్తుతం చెత్త సేకరణలో చిత్తవుతున్న తణుకు ప్రాంతంలో సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 15వ తేదీన స్వచ్ఛ భారత్ – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని తణుకులో నిర్వహిస్తున్నారనే విషయం తెలుసుకున్న ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

చిరువ్యాపారులకు షాక్...

రాష్ట్రపతి రోడ్డులోని రోడ్డును ఆనుకుని ఉన్న చిరు వ్యాపారులపై అధికారుల ఆంక్షలు విధించడంతో బెంబేలెత్తిపోతున్నారు. గురువారం నుంచి చిరు వ్యాపారులు రోడ్డుపై ఉండరాదంటూ మునిసిపల్ సిబ్బంది చెప్పడంతో వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. వరుసగా మూడు రోజులపాటు వ్యాపారాలు చేయకుండా ఎలా భగవంతుడా అంటూ దండాలు పెడుతున్నారు. గతంలో ఎన్నడూ ఇలా లేదని ఏ ముఖ్యమంత్రి వచ్చినా ఇటువంటి ఆంక్షలు లేవంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చెట్ల కొమ్మలు నరికివేత..

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన సమయంలో విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశ్యంతో విద్యుత్ శాఖ అధికారులు గురువారం ఉదయం భారీగా చెట్ల కొమ్మలు నరికించారు. దీంతో పచ్చగా ఎదిగిన చెట్ల కొమ్మలు విద్యుత్ తీగల వరకు వెళ్లకపోయినా నరికేశారంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లుగా ఎటువంటి సమాచారం ఇవ్వకుండా గురువారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో చాలా ఇబ్బందులు పడ్డామని ప్రజలు ఆరోపించారు. ముందుగా సమాచారం ఇస్తే మా ఏర్పాట్లు మేము చేసుకునే వారమని, స్నానానికి కూడా నీళ్ల లేక కటకటలాడామని ఆరోపించారు.


తణుకు రైల్వే స్టేషన్ రోడ్డులో స్టాక్ పాయింట్‌లో చెత్త


తణుకు లయన్స్ క్లబ్ వీధిలో రోడ్డుపై పేరుకున్న చెత్త


తణుకు సజ్జాపురంలో పచ్చని మొక్కలను కొట్టేసిన దృశ్యం

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): నియోజకవర్గంలోని తాడేపల్లిగూడెం టౌన్, పెంటపాడులలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. టౌన్‌లోని ఐదు సెంటర్‌లు శ్రీవాసవి, ఆదిత్య, జీఎంఆర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డీఆర్ గోయెంకా ఉమెన్స్ జూనియర్ కళాశాలలోను, పెంటపాడులో ఒక సెంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షలకు సంబంధించి మొత్తం 2,402 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 2346 మంది పరీక్షలకు హాజరయ్యారు. 56 మంది పరీక్షలు రాయలేదు. ఛీఫ్ సూపరింటెండెంట్, డిపార్టమెంటల్ ఆఫీసర్‌లు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వన్ టౌన్‌లోని హౌసింగ్ బోర్డు, కొండయ్య చెరువు సబ్ స్టేషన్ల పరిధిలో మెయిన్ రోడ్డు, రైల్వే ఫీడర్, సత్యవతినగర్ ఫీడర్‌లు, కొండయ్య చెరువు ఫీడర్, కడకట్ల ఫీడర్, ఎల్‌బీసీ ఫీడర్‌లకు సంబంధించి విద్యుత్ లైన్‌లు రిపేర్ల నిమిత్తం ఈ నెల 14వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి తెలిపారు. మెయిన్‌రోడ్డు, నల్లజర్ల రోడ్డు, తాలూకా సెంటర్, భూపాల్‌నగర్, జూబ్లీరోడ్డు, స్టేషన్‌రోడ్డు, సిపాయి పేట, కోతిబొమ్మ సెంటర్, సత్యవతి నగర్, వీకర్స్‌కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, అబ్బులు కొట్టు సెంటర్, కొండయ్యచెరువు, హంగ్రీబర్డ్స్ సెంటర్, రమాదేవి ఆసుపత్రిఏరియా, ఉమెన్‌కళాశాల రోడ్డు, కడకట్ల, అంబేడ్కర్ నగర్, హెచ్‌పీ గ్యాస్ రోడ్డు, యానదులకాలనీ, రామారావుపేట, పోస్టాఫీస్ రోడ్డు, కర్నాలసత్రం, కోదండరామాలయంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

మంచినీటి సరఫరా పునరుద్ధరణ


జగన్నాథపురం గ్రామంలో పైపు లైన్ పనులను పర్యవేక్షిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజా శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం ఎస్సీ ఏరియా, కొత్తపేట ప్రాంతాల్లో ఇటీవల మంచినీటి సరఫరాకు స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించి, మంచినీటి సరఫరాను గురువారం పునరుద్ధరించారు. ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి బాలగోపాల శ్రీనివాస చంద్రరాజు ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేశారు. త్వరలోనే మంచినీటి ట్యాంకు ప్రారంభించనున్నామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది ఉండదని గ్రామ సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక తెలిపారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత


విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేస్తున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 60మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని గురువారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా మానవత అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో ఉత్తమమైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనపనేని రాజేంద్రకుమార్, పాండురంగారావు, తుమరాడ చిన్న, బురిడి సతీష్, మిరియాల కిషోర్‌కుమార్, కాకర్ల నవీన్‌బాబు, చేకూరి బంగార్రాజు, స్కూలు ప్రధానోపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో హోలీ సంబరాలు


భవిత కేంద్రంలో రంగుల హోలీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో గురువారం ముందస్తు రంగుల హోలీ నిర్వహించారు. భవిత విద్యార్థులు వివిధ రంగులను చల్లుకున్నారు. ఆనందోత్సాహాల మధ్య డాన్స్‌లు చేశారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బి.జ్యోతి, భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాల ఈశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, దివ్యాంగుల పిల్లలు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మదనగోపాలుడికి విశేష పూజలు


విశేష అలంకరణలో మదనగోపాలస్వామి

అత్తిలి: మండలంలోని బల్లిపాడు మదనగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలలో భాగంగా గురువారం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. మదనగోపాల్ స్కూల్ విద్యార్థులు విష్ణుసహస్రనామ పారాయణం, భగవద్గీత పారాయణం చేశారు. సాయంత్రం ఘంటసాల ఆర్కెస్ట్రా నిర్వహించారు. భక్తులు హాజరై శ్రీస్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవాలలో శుక్రవారం స్వామివారికి చక్రస్నానం, రాత్రి ఆంజనేయ వాహనంపై గ్రామోత్సవం, భీమవరం వారిచే వెంకీ ఈవెంట్స్ అండ్ ఆర్కెస్ట్రా కార్యక్రమం జరుగుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్ లోక్‌నాథ్ శ్రీనివాస్ చెప్పారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

పెంటపాడు: సేంద్రియ వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకొని, ఖర్చులు తగ్గించుకోవాలని గూడెం వ్యవసాయశాఖ ఏడీఏ పి. మురళీకృష్ణ పేర్కొన్నారు. గురువారం పెంటపాడు మండల కార్యాలయం వద్ద రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి మోహనరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు విషయాలను రైతులకు వివరించారు. మండల వీఏఏలు పాల్గొన్నారు.

డ్రెయిన్స్ వ్యవస్థ మెరుగుపరచాలి

తణుకు అర్బన్: పశ్చిమ గోదావరి జిల్లాలో డ్రెయిన్స్ వ్యవస్థ మెరుగుపరచాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ అన్నారు. గురువారం శాసనమండలిలో పలు సమస్యలను ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు. డ్రెయిన్స్ పూడుకుపోవడం వలన వర్షం నీరు చేలల్లోంచి బయటకు వెళ్లలేక చేలోనే నిల్వ ఉండి పంటలు వేసుకొనే పరిస్థితి లేకుండా పోయిందని స్పష్టం చేశారు. ముఖ్యంగా తణుకు మండలం తేతలి నుంచి మండపాక డ్రెయిన్ వరకు కొన్ని చోట్ల ఆక్రమణలకు గురై మరికొన్ని చోట్ల వెడల్పు బాగా తగ్గి నీరు నిలిచి పోతుందని అన్నారు. దీని మూలంగా తేతలిలో 200 వందల ఎకరాలు సేద్యానికి ఉపయోగపడకుండా పోయిందని, ఈ ప్రాంతాల్లో డ్రెయిన్లు వెడల్పు చేసి ఆక్రమణలు తొలగిస్తే రైతులకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. జిల్లాలో ఉన్న యనమదుర్రు డ్రెయిన్, నక్కల కాల్వ, ఇతర డ్రెయిన్స్ కూడా వెంటనే బాగు చేస్తే వచ్చే పంటలను రైతులు సద్వినియోగం చేసుకుంటారని చెప్పారు. అలాగే మురుగు నీటి నిల్వల మూలంగా దోమల వ్యాప్తి పెరిగి వ్యాధులు సంక్రమిస్తున్నాయని తక్షణమే సమస్యను అరికట్టాలని కోరినట్లు చెప్పారు.


ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

మంచి ఆహార అలవాట్లు.. జాగ్రత్తలు పాటించాలి

తణుకు అర్బన్: మానవ శరీరంలో అవయవాలు భద్రంగా ఉండాలంటే మంచి ఆహార అలవాట్లు, నిత్య వ్యాయామం తప్పనిసరిగా పాటించాలని మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ వంకా రాజకుమారి అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని లయన్స్ 316 జి వంకా సత్యనారాయణ, నాగమణి రీనల్ డయాలసిస్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ముఖ్యంగా మధుమేహం, అధిక రక్తపోటు అదుపులో ఉండేలా చూసుకోవాలని, వైద్యుడి ప్రమేయం లేకుండా ఎక్కువగా పెయిన్ కిల్లర్స్ వాడకూడదని స్పష్టం చేశారు. సెంటర్‌లో అనేక మంది చిన్న వయస్సులో ఉన్న వారు సైతం డయాలసిస్‌కు రావడం బాధాకరమని, మొదటి నుంచి తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల రెండు కిడ్నీలు దెబ్బతిని ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. డయాలసిస్ సెంటర్ కన్సల్టెంట్ డాక్టర్ రవి శంకర్ సూచనలు పాటించి, ఆరోగ్యాన్ని నిలకడగా ఉంచుకోవాలని సూచించారు.


డయాలసిస్ సెంటర్‌లో మాట్లాడుతున్న మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ రాజకుమారి

పండ్ల పంపిణీ..

పైడిపర్రు, తేతలి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పీడీజీ లయన్ మాదిరెడ్డి బాబూజీరావు సౌజన్యంతో డయాలసిస్ సెంటర్‌లో ఉన్న బాధితులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా బాబూజీరావు మాట్లాడుతూ గత 9సంవత్సరాలుగా రోగులకు అత్యున్నత సేవలు అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం నుంచి రూ. 1.95 కోట్లు బకాయి ఏర్పడిందని, అయినప్పటికీ ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ కుటుంబసభ్యుల సహకారంతో ఎటువంటి లోటు లేకుండా సేవలందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఉందుర్తి ప్రసన్నకుమార్, కోశాధికారి చీర్ల వెంకటేశ్వరరావు, డైరెక్టర్ కుడారి రజిని, అల్లూరి కరుణాకర చౌదరి, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

అత్తిలి: బహుళ పంటలను సాగు చేయడం ద్వారా నేలలో సేంద్రియ కర్బనశాతం పెరుగుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. గురువారం అత్తిలి మండలసమాఖ్య భవనంలో కన్వర్జెన్సీ సమావేశం ఏపీఎం మహమ్మద్ ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా ఏఓ రాజేష్ మాట్లాడుతూ నవధాన్యాలు సాగు చేపట్టడం వల్ల కలుపుశాతం తగ్గుతుందని, వివిధ పంటల వేర్లు భూమిలో వివిధ సూక్ష్మజీవులకు ఆశ్రయం ఇస్తాయని, తద్వార ప్రధన పంటకు కావాల్సిన అన్ని రకాల పోషకాలు అందుతాయన్నారు. వాతావరణ వైపరీత్యాలను తట్టుకునే సామర్థ్యం ఉంటుందని, నవధాన్యాలు సాగు చేసిన పొలంలో ప్రధన పంటలో వచ్చే చీడపీడలను తట్టుకుంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, పెరటితోటలు, రసాయన ఉత్పత్తులు మనిషి ఆరోగ్యంపై ఏవిధంగా ప్రభావం చూపుతున్నాయో ఏపీఎం మహమ్మద్ వివరించారు. నవధాన్యాలు కావాల్సినవారికి గ్రామ సంఘాల ద్వారా రుణాలు ఇప్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఐసీఆర్పీ టి గంగాధర్, వై లక్ష్మి, మధు, వీఏఏలు, వీఓఏలు పాల్గొన్నారు.


అత్తిలిలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ రాజేష్

తడి, పొడి చెత్తను శానిటేషన్ సిబ్బందికి అందజేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ప్రజలందరు శానిటేషన్ కార్మికులకు తడి చెత్త, పొడి చెత్తను తప్పక అందజేయాలని, డ్రెయిన్‌ల్లో, రోడ్లపై చెత్త వేయవద్దని మునిసిపల్ కమీషనర్ ఎం.ఏసుబాబు విజ్ఞప్తి చేశారు. గురువారం ఉదయం కమీషనర్, శానిటరీ ఇనస్పెక్టర్ శ్రీమన్నారాయణ, సిబ్బంది ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాలను సందర్శించారు. వన్‌టౌన్‌లోని కడకట్లలో జరుగుతున్న శానిటేషన్ డ్రైవ్‌ను ఆయన పరిశీలించారు. రోడ్డు మార్జిన్‌లలో ఉన్న చెత్త చెదారాలు, డ్రెయిన్‌లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు అందజేశారు. అపారిశుద్ధ్య పరిస్థితులు లేకుండా చూడాలన్నారు. అదే విధంగా టూ టౌన్‌లోని రోడ్డు మార్జిలను, శానిటేషన్‌ను పరిశీలించారు. మునిసిపల్ కార్యాలయం వద్ద అన్నా క్యాంటీన్‌ను పరిశీలించి, సిబ్బందికి సూచనలు అందజేశారు. స్థానికులు వద్ద నుంచి ఆహార పదార్ధాలు ఎలా ఉన్నాయో అభిప్రాయాలు సేకరించారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


శానిటేషన్‌పై సిబ్బందికి సూచనలు ఇస్తున్న మునిసిపల్ కమీషనర్ ఏసుబాబు

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): జిల్లాలో గత సంవత్సరం అధిక వర్షాలు, ఎర్ర కాలువ ముంపునకు గురై వేలాది ఎకరాలు పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఏపీ రైతు, జిల్లా రైతు సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 15వ తేదీన ముఖ్యమంత్రి తణుకు వస్తున్న సందర్భంగా నష్టపోయిన రైతాంగానికి ఆర్థిక సహాయం, నష్టపరిహార చెక్కులు అందించాలని రైతు సంఘం విజ్ఞప్తి చేశారు. పట్టణంలో గురువారం జరిగిన సమావేశంలో వక్తలు జిల్లా నాయకులు చింతకాయల బాబురావు, చిర్ల పుల్లారెడ్డి, సిరపరపు రంగారావులు మాట్లాడుతూ జిల్లాలో తాడేపల్లిగూడెం, తణుకు తదితర ప్రాంతాల్లో ఎర్ర కాలువ ముంపునకు గురై వేలాది ఎకరాలు తీవ్రంగా పంట నష్టం జరిగిందన్నారు. నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుంటామని, పరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, ఇప్పటికి నెలలు గడుస్తున్నా, రైతాంగానికి నష్ట పరిహారం అందలేదన్నారు. ఇటీవల శాసన సభ్యులు అసెంబ్లీలో ప్రస్తావించారని, అయినా ప్రభుత్వం వ్యవసాయ అధికారులు సమస్యను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు సహాయం అందిస్తామని చెప్పారని, 10 నెలలు గడుస్తున్న నేటికి పథకం అమలు చేయాలేదన్నారు. ఎరువులు, పురుగుమందులు ధరలు విపరీతంగా పెరిగి వ్యవసాయం భారం అవుతున్నందున సుఖీభవ పథకం ద్వారా ఆదుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న జిల్లా నాయకులు చింతకాయల బాబూరావు, తదితరులు

ఉగాది కవితల పోటీల్లో పాల్గొనండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రపంచ కవితా దినోత్సవం, ఉగాది సందర్భంగా కవులందరిని ప్రోత్సహించేందుకు శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కవితల పోటీలు నిర్వహిస్తున్నట్లు వేదిక కన్వీనర్ కొల్లి రమావతి తెలిపారు. ఈ నెల 16వ తేదీలోగా ఆయా కవితలను శ్రీశ్రీ కళావేదిక వాట్సాప్ గ్రూపుల్లో రాయాలని, కవుల ఫొటోలను జతచేయాలని కోరారు. కవితల పోటీ కోసం మాత్రమే రాయలని, స్వంతంగా ఉండాలని పలు అంశాలను పరిగణలోనికి తీసుకుంటామని తెలిపారు. కవితల పోటీలలో విజేతలకు ఈ నెల 23వ తేదీన రాజమహేంద్రవరం ఆనం రోటరీ హాల్‌లో జరిగే కార్యక్రమంలో విలువైన మొదటి నుంచి నాలుగు బహుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు. వివరాలకు ఫోన్ నెంబర్లు 99080 66242, 82475 19925లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

పనిభారం తగ్గించాలని విజ్ఞప్తి


ఎంపీడీవో (డీఎల్‌పీవో ఇన్‌చార్జి) బాలాజీకి వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శుల సంఘ నాయకులు

పెంటపాడు: పెరిగిపోతున్న పని ఒత్తిడిని తగ్గించాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీ కార్యదర్శులసంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసనలో భాగంగా పెంటపాడు మండల కార్యదర్శుల సంఘం గురువారం నిరసన తెలిపింది. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకురాలు దేవాబత్తుల నాగదేవి ఆధ్వర్యంలో పెంటపాడు మండల కార్యాలయం వద్ద నిరసన తెలిపి తమ సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాగదేవి మాట్లాడారు. సంఘ నాయకులు ఎం. శేఖర్ బాబు, గోడి బాలకృష్ణ,శోభన్‌కుమార్ పాల్గొన్నారు.

305 పాడి పశువులకు టీకాలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కడియద్ద గ్రామంలో గురువారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ పర్యవేక్షణలో 73 ఆవులు, 232 గేదెలకు టీకాలు వేశారు. కాగా, శుక్రవారం వీరంపాలెంలో టీకాలు వేయనున్నట్లు ఏడీ అనిల్‌కుమార్ తెలిపారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పంట కాలువలో జంతు కళేబరాలు


పంట కాలువలో కొట్టుకొస్తున్న జంతు కళేబరాలు

భీమవరం అర్బన్: మండలంలోని కాళీపట్నం ఛానల్‌లో జంతు, కోళ్ల కళేబరాలు కొట్టుకురావడంతో దిగువ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఛానల్ భీమవరం పట్టణంనుంచి యనమదుర్రు, దిరుసుమర్రు, రామాయణపురం, నాగిడిపాలెం గ్రామాల మీదుగా మొగల్తూరు మండలంలోని కాళీపట్నం పంచాయతీలోని పలు గ్రామాలకు వెళుతుంది. ఛానల్‌ను ఆనుకుని వేలాది వరి, చేపలు, రొయ్యలు చెరువులకు, గ్రామాల్లోని రక్షిత మంచినీటి చెరువులకు సాగు, తాగునీరు అందిస్తుంది. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో మృతి చెందిన కోళ్లు, జంతు కళేబరాలు కొట్టుకొస్తున్నాయి. దీంతో ఛానల్ పరివాహక గ్రామస్తులు ఆ నీటిని తాగితే వ్యాధులు ప్రబలుతాయేమోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కాలువలో కోళ్లు, జంతు కళేబరాలు, చెత్త వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నిబంధనలకు తిలోదకాలు

కాళ్ల: ఆక్వా సాగులో ఉప్పునీటి బోర్లు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నా నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నారు. దీంతో అక్రమ బోర్లు యథేచ్ఛగా వెలుస్తున్నాయి. కాళ్ల మండలం కోపల్లె గ్రామ పరిధిలో పరాలమ్మ గుడికి వెళ్లే దారిలో బొండాడ డ్రెయిన్ గట్టును ఆనుకుని ఎటువంటి అనుమతులు లేకుండా ఉప్పునీటి బోరు వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో బోర్లు వేస్తున్నారని అందుకే అధికారులు అటువైపు చూడడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉప్పునీటి బోర్లు వలన భూగర్భ జలాలు పాడై పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పర్యావరణ వేత్తలు, నిపుణులు హెచ్చరిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వేస్తున్న ఉప్పునీటి బోర్లను వెంటనే సంబంధిత శాఖ అధికారులు అడ్డుకొని చర్యలు తీసుకోవాలని రైతులు, పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

ఆరోగ్యకరమైన జీవనశైలితో కిడ్నీలు భద్రం

తాడేపల్లిగూడెం: ఆరోగ్యకరమైన జీవనశైలితో కిడ్నీలు భద్రంగా ఉంటాయని గురువారం పట్టణంలోని నన్నయ్య విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జరిగిన ప్రపంచ కిడ్నీల దినోత్సవంగా కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.అశోక్ అన్నారు. మూత్రపిండాల పనితీరును తెలుసుకోడానికి హైడ్రేషన్, క్రమం తప్పకుండా తనిఖీలు, ఆహారాలను అధికంగా తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన ఉండాలన్నారు. మూత్రపిండాల సంబంధిత వ్యాధులను ముందుగా గుర్తించి, నివారణకు ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోర్సు కో ఆర్డినేటర్, అధ్యాపకులు పాల్గొన్నారు.


నన్నయ్య ప్రాంగణంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ టి.అశోక్